# బారిష్టరు గారి బాతాఖానీ

మొక్కపాటి నరసింహశాస్త్రి

## ఆంధ్రత్వం: పదహారణాల ఆంధ్రుడు

నేను మామూలుగా సాయంకాలం అయిదు కావడంతోటే క్లబ్బుకు బయలుదేరి వెళ్లాను. వేపచెట్టుకింద కుర్చీలు వగైరాలన్నీ అప్పటికే అమర్చబడి ఉన్నాయి. అప్పటికప్పుడే టెన్నీసు కోర్టులో బంతు లెగురుతున్నాయి. పేకాట ప్రభువు లింకా ఎవ్వరూ రాలేదు. కేరమ్సు బల్ల నిర్జీవంగా ఉంది. చదరంగంబల్ల మొన్నటి గందరగోళంతో వాడిలిపోతూ ఓమూలగా ఒదిగి ఉంది. పత్రికల బల్లదగ్గర మామూలు పెద్ద లిద్దరూ ఏకధ్యానంతో చెరొకపత్రికా పారాయణ చేస్తున్నారు. వాళ్ల చేతుల్లోనుంచి ఎప్పుడేనా పత్రికలు ప్రాణంతో బయటపడతాయేమో, ప్రధాన వాంశాలేనా ఒక్కసారి చూచిపోదామని ఇద్దరు యువకులు ప్రాణాలు బిగపట్టుకు కూర్చున్నారు.

అలవాటుచొప్పున నేను వేపచెట్టుకింద కుర్చీలో చతికిలపడ్డాను. ఏమీ తోచలేదు. కుర్రవాడినిపిలిచి పేక తీసుకురమ్మని ఏకాకిగా, ఏకాంతంగా 'పేషన్సు' ఆడడం మొదలుపెట్టాను. ఒక్క ఆటేనా పూర్తి కాకుండానే విఘ్నం వచ్చింది. స్వగృహంలో స్వగదిలోనో, ఏదో ఆశ్రమంలోనో చెయ్యవలసినపని క్లబ్బులో తలపెట్టడం తప్పేననుకోండి. క్లబ్బులో ఏపని తలపెట్టినా అది తగలెయ్యడమే జీవిత పరమావధిగా పెట్టుకొన్న ఎందరో మహానుభావులను నేను ఎరుగుదును. ఆటమధ్యలో ఉండి ఒక్కసారి తల పైకెత్తగానే టప్పయ్య కనపడ్డాడు. ఎప్పుడొచ్చాడో కాని చడీ చప్పుడూ కాకుండా, ఏమాత్రం అలికిడైనా ఈ పేకముక్కలన్నీ ఎగిరి మీద పడతాయేమో అన్నట్లు వాడిలిపోతో ఓ మూలగా ఒదిగి కూర్చున్నాడు. 'ఇదుగో' అని ఒక మందహాసం నాకేం భయంలే దన్నట్లు అతనిమీద పారేసి, మళ్ళీ నా ఆటలో పడ్డాను. 'గురువుగారూ నమస్కారమండి' అని రామం ఓ కుర్చీలో చతికిలపడ్డాడు. 'నమస్తే గురుదేవ్' అంటూ భద్రం దక్కొ వచ్చాడు. 'ఇదుగో వస్తున్నా' అంటూ ముక్క ఎక్కడపెడితే బాగుంటుందా అని ఆలోచిస్తుండగా 'ఎందరో మహానుభావులూ, వారలందారికీ' అంటూ శర్మరావడం వినపడ్డది. ఇంక లాభంలేదని ముక్కలు కలిపేస్తుండగా 'ఏమి మహానుభావా! ఈవేళ తమరుకూడా ఇటువంటి నైచ్యానికి దిగారేమిటి' అంటూ శాస్త్రి వచ్చాడు. 'ఏదేనా ఒకఆట వేద్దామంటారా ఏమిటి గురూజీ' అన్నాడు భద్రం కొంచెం సందేహిస్తూ.

శాస్త్రి వెంటనే అతనికేసి తీవ్రంగా మెస్మరిస్టు (*Mesmerist*)లా చూచి, 'తప్పు నాయనా తప్పు. అటువంటి అకార్యకరణాలకేమీ ఇక్కడ ఆస్కారంలేదు. మనం వేరు; మన ఆశ్రమం వేరు మన ఆదర్శాలు వేరు. ఇటువంటి తుచ్ఛవాంఛల కిచట తావులేదు తండ్రీ. మనం విజ్ఞానవేత్తలం, మనం తత్వదృష్టితో ప్రపంచ వ్యవహారం పరిశీలించాలి: రాజకీయాలు పరామర్శించాలి! ఐహికంయొక్క అర్థం, ఆముష్మికంయొక్క అంతర్యం తేల్చాలి. ఇలాటిది బోలెడంత మహత్కారం మన ఆశ్రమవాసులు సాధించవలసినదిగా ఉండగా, చీట్లాట...ఛీ ఛీ ఛీ! అయితే బారిష్టరుగారూ, ఏమిటి విశేషాలు. ఈవేళ మన చర్చనీయాంశమేదో తేల్చడానికి కోసిగరెట్టు ముట్టిద్దామా, తరవాత మధ్యేమధ్యే పానీయానికి పురమాయిద్దాం' అన్నాడు 'శుభం' అన్నాం ఏకగ్రీవంగా.

క్లబ్బుపూటయింది. టెన్నీసు కోర్టులో జనం ఎక్కువయ్యారు. జనంతోపాటు హడావిడీ ఎక్కువయింది. 'కొట్టూ! దంచూ! చంపూ! బ్యూటీ (*Beauty*)' అనే ప్రేక్షకుల ఉత్సాహవచనాలు క్లబ్బు

## విషయానుక్రమణిక


ముఖచిత్రం :—

నటి రాజసులోచన

| | |
|---|---|
| బారిష్టరుగారి బాతాఖానీ | 2 |
| మునిమాపు— | 6 |
| సుశీల— | 12 |
| అట్టమీదబొమ్మ— | 19 |
| పిల్లిమొగ్గలు— | 24 |
| వనితాలోకం— | 27 |
| బొమ్మరిల్లు— | 38 |
| టామ్‌సాయర్ ప్రపంచయాత్ర— | 40 |
| కోయిలపుట్టుక— | 45 |
| సినిమా— | 50 |

ఆవరణదాటి రోడ్డు చివరవరకూ వెళ్ళి ఉండాలి ఏమంటే ఎవరినో కొట్టడం, చంపడం, చూతామని దారేపోయేవాళ్లు చాలామంది లోపలికి తొంగిచూచి, చంపేవాడుకాని చంపబడేవాడుకాని కనపడక, నిరుత్సాహపడి చక్కాపోయారు.

చదరంగంబల్లదగ్గర ఆడేవాళ్లు ఇద్దరయినా, వారి ఉభయులకూ సలహాదార్లు మాత్రం సుమారు ఇరవైమందిదాకా చేరారు. అసలు వాళ్లు మాట్లాడడంలేదుకాని - మాటదాకా ఎందుకు ఆశేలేదు - ప్రేక్షకులు మట్టుకు ఊరికే ఉద్రేకం తెచ్చుకుని, 'తయోత్తుకాదు.. ఉండు - అది కదపకు - ఆగవోయి మగడా.. ఏమిటా హడావిడి - అటు జరిపితే చచ్చిందన్నమాటే ... జరపవోయి ఎలా చస్తుందో చూస్తాను - ఆ! చూస్తావు - ఇందాకటినుంచీ చూస్తున్నావు కాదూ! నీ సామ్మేంపోయింది. ఉండవోయి. అది కదపద్దంటే అదే తీస్తావేం... నీకెందుకు తియ్యవోయ్ చచ్చినా దాన్ని కదపనివ్వను.. ఇలాగు మందరంనుంచి తారస్థాయివరకూ వెడుతోంది.

పక్కనున్న పేక ఆటవాళ్లకు ఈ గొడవే పటలేదు. ఇంత ఏకాగ్రత ఉన్నవాళ్లు నిజంగా యోగాభ్యాసంలోకే దిగితే ఎలా ఉండేదో అనుకున్నాను వాళ్ల జేస్తులేమిటో, కుడేళ్ళేమిటో, పంపకాలేమిటో; అంతే తప్ప మరో గొడవేమీ వాళ్లకు పట్టలేదు.

మేము సిగరెట్లు ఆఖరుదమ్ము తీసేసరికీ, సరిగ్గా కాఫీ అందుకుంది. సిగరెట్టు పొగలోనుంచి కాఫీ పొగలోకి - సినీమా భాషలో - డిస్సాల్వ్ (Dissolve) చెయ్యడానికి వీలుగా ఆ క్షణానికి ఎలా అందిందిచాడా అని ఆశ్చర్యపోతూ, బాతాఖానీలోపడ్డాం. ఆమాటా ఈ మాటాలోనుంచి నెమ్మదిగా రాష్ట్రీయ రాజకీయాలూ, ప్రాంతీయ పక్షపాతాలూ, అన్యోన్య అవమానాలూ మొదలైన సామాన్య విషయాలను గురించి సంభాషణ సాగించాం. మాకు తెలియకుండానే ఎలా మారిందో గుర్తులేదుకాని ఆంధ్రులూ, వాళ్ల వ్యక్తిత్వం, ప్రత్యేకతను గురించి వచ్చింది ప్రశంస. ఎవళ్ళకు తోచింది వాళ్లు చెప్తున్నారు.

ఇంతలో పేకాట దగ్గరో, చదరంగం దగ్గరో పేచీ మామూలు శృతి మించినట్లనిపించింది. ఏమిటా అని అనుకుంటూండగానే పెద్ద కేకలు వినపడ్డాయి. క్లబ్బులో అందరూ చదరంగం బల్లకేసి పరుగెత్తారు. మేము మా స్థానాలు వదలలేదుకాని, అదేదో తేలిన తరువాత మాట్లాడుకోవచ్చునని, పర్యవసానంకోసం నిరీక్షిస్తూ కూర్చున్నాం. నాలుగైదు నిమిషాల్లో హోరు చాలా భాగం తగ్గింది. అక్కడకు పరుగెత్తిన జనభా గుంపులు గుంపులుగా నవ్వుకొంటూ వాళ్ళ వాళ్ళ కార్యరంగాలవైపు సాగారు. ఇంతకూ అసలు సంగతేమిటంటే, ఏమీ లేదు. చదరంగం బల్లదగ్గర సలహాదార్లలో మాటా మాటా పెరిగింది. అందులో ఒకాయన దాక్షిణాత్యుడు, పెద్దవాడు. రెండోవాడు మనవాడు, యువకుడు. ఈ భోగట్టా



మేము తెలుసుకుంటూ ఉండగానే ఆ యువకుడు 'ఒళ్లు దగ్గర పెట్టుకు మాట్లాడు, ఏమనుకుంటున్నావోను. ఎక్కడున్నదీ, ఎవరితోటి వ్యవహరిస్తున్నదీ కానకుండా ఉన్నావు. లోపలుండిపోయావు - బతికావు. బయటకొస్తే నీ బండారం బయటపడేది' అని కేక లేసుకుంటూ వీధిలోకి పోతున్నాడు.

'సరిదా. పో అయ్యా, ఇక్కడ ఏమి చేస్తివి - అక్కడా అద్దా చేస్తువు' అన్నాడు ఇక్కడ తమిళ సోదరుడు.

ఈ మాటవిని బయటకు వెడుతున్న యువకుడు ఆగి, 'ఏం చేస్తానా, డొక్క బద్దలు చేస్తాను. నీకు దిక్కున్న చోట చెప్పుకోవాలి. నే నెవరనుకుంటున్నావో - ఆంధ్రుణ్ని - తెలుసా - ఆంధ్రుణ్ణి - పదహారణాల ఆంధ్రుణ్ణి-మొగాడవైతే రా...' అంటుండగానే, నలుగురు కుర్రాళ్లు వెళ్లి, వాడిని రెక్కట్టుకుని బయటకు లాక్కెళ్లి రోడ్డుమీద విడిచి పెట్టారు.

ఇదేమి టన్యాయం, మనవాడిని అలా ఈడ్చేస్తున్నారు అంటూ మా భద్రం, కొంచెం ఉద్రేకంతో లేచాడు. 'వధవ అల్లరి నువ్వూను. పోనీ అని ఊరుకుంటూంటే మరీ రోజురోజుకీ న్యూసెన్సుగా తయారయ్యాడు. ఈమాటు క్లబ్బులో అడుగు పెట్టిచూడు, ఏం చేస్తామో' అంటూ వచ్చారు ఈ యువకులు.

'అయితే మన పదహారణాల ఆంధ్రుడు ఇక్కడ మెంబరు కాదన్న మాట' అన్నాడు రామం, తెల్లబోయి.

"కాడు నాయనా కాడు. సభ్యత్వం ఉంటే వాడూ మనకు మల్లేనే వేడ ఆంధ్రుడో పావలా ఆంధ్రుడో అయి ఊరుకునేవాడు అన్నాడు శర్మ.

'బాబూ, గురువుగారూ, నాకు తెలియక అడుగుతాను. ఈమధ్యన ప్రతివాడూ ఇదొకటి ఆరంభించాడు...పదహారణాల ఆంధ్రుడిని అంటూను. దాని భావమేమిటి స్వామీ' అన్నాడు రామం. 'మరేనండి. ఈ మధ్యన మరీ ప్రతివాడూ ఆరంభించాడు అన్నాడు టప్పయ్య.

'ఏముందీ. ఇదే. ఇప్పుడు ప్రత్యక్షంగా చూచావుగా. ఇంకా సందేహమెందుకూ' అన్నాడు శర్మ.

'ఏమిటి శారిష్టరుగారు. మౌనముద్ర వహించారు. తమ అభిప్రాయం సెలవియ్యాలి,' అన్నాడు శాస్త్రి.

'అభిప్రాయమేముంది. నాకూ ఇలాటి సందేహమే కలిగింది. ఆ అనే పెద్దమనుష్యులనుకూడా ఒకరిద్దర్ని అడిగాను. వాళ్లేమీ సమాధానం చెప్పలేక నవ్వి ఊరుకున్నారు. మా శిరోమణి చెప్పినట్లు దీని సంగతేదో తేలుద్దామని కొంత రిసర్చి ఆరంభించాను' అన్నాను. 'వినుడు- వినుడు. అవధరింపుడు శౌనకాది మహామునులారా - అవధరింపుడు. ఆ: శెలవివ్వండి నూతమహాశయా' అన్నాడు శాస్త్రి. అందరూ నవ్వారు. 'నూతో నాచ. కానివ్వండి' అన్నాడు మళ్లీ శాస్త్రి.—

నేను చెప్పానుకాదూ, ఎవ్వరూ సరియైన సమాధానం చెప్పలేదు. ఇది బాగుంది కాదు. పోనీ ఒకడిని వెంటాడి వాడి మాటలూ చేష్టలూ జాగ్రతగా కనిపెడితే ఏమన్నా తేలకపోతుందా అనుకున్నాను. మా ఇంటికెదురుగా ఒక ఆసామీ ఉండేవాడు. అతను గంటకథమం నాలుగైదు సార్లేనా ఈ పదహారణాల ప్రయోగం చేస్తూండేవాడు. అందుకని నెమ్మదిగా అతని స్నేహంచేసి అస్తమానం అతనితో అతని నీడలా తిరగడం మొదలెట్టాను. మనకీ శిష్యులు బయలుదేరుతున్నారని అతను చాలా సంతోషించాడు. నాలుగు రోజుల్లోనే తేలిపోయింది.

"ఏమిటి" అన్నాడు శర్మ.

ఏమీ లేదు. వస్తెగింజలో బియ్యపుగింజ. నేను కనిపెట్టిన విషయాలు ఒకటి రెండు చెపుతే మీకే తెలుస్తుంది. పొద్దున్నే లేచేవాడు. దంతధావనంచేసి తలేనా దువ్వుకోకుండా, ఆ గూడకట్టులోనే పైకి వచ్చేవాడు. ఇంటిదగ్గ రెప్పుడూ గూడకట్టే కాని కట్టేవాడుకాడు. అతనన్నమాటేమిటియువకులను ఎవర్ని చూచినా అరవల గూడకట్టో లేకపోతే తురకల లుంగీయో. పదహారణాల ఆంధ్రుడు చచ్చినా పంచ కట్టడు. గూడకట్టే అయితే అది మళ్ళీ సంగవరకూ పైకి మడిచి కట్టవలసిందే. ఇది మొదటి సూత్రం. మా ఆసామీ చిన్నగా కాఫీహోటలుకు నడిచేవాడు - అరవ కాఫీ హోటలుకు. నేను ఒకటి రెండు సార్లు, మన తెలుగు వాళ్ల హోటలుకు తీసుకు వెడదామని ప్రయత్నం చేశాను.

'పోనిద్దురూ - వెధవ హోటలు - మనవాడు హోటలు పెట్టడమేమిటి - అది అరవలసొమ్ము. అది వాళ్ల జన్మహక్కు. అందుకు పుట్టారు. అవసరమైతే అందుకు చస్తారు కూడాను' అన్నాడు.

అక్కడ ఫలహారంకూడా ఇడ్లీ సాంబారు ప్రధానంగా సేవించేవాడు. 'ఏమిటో మీరు దురభిమానం పెట్టుకుని మనవాళ్లా మన హోటళ్లూ అంటారుకాని చస్తే ఇలాటి ఇడ్లీలుకాని ఇలాటి సాంబారుకాని మన వాళ్లు చెయ్యగలరుటండీ, కబుర్లుకాని' అనేవాడు - హోటలునుంచి పైకిరావడంతోటే ఏదో వంక కల్పించుకుని అరవవాళ్లను తెగ తిట్టేవాడు.

ఒకమాటు గానసభ అవుతుంటే వెడదామురమ్మన్నాను. 'ఎవరు పాడేది' అన్నాడు.

'మనవాడేనండి. కొత్తగా తయారయ్యాడు. చాలాబాగా పాడతాడన్నాను.

'వాడిజొంద పోనిద్దురూ. మనవాళ్లకు సంగీతం ఏమిటి. శాస్త్రీయసంగీతం అరవవాళ్లసొమ్ము. వాళ్లు నిఘలు దక్షిణాదిని పుట్టిన గాడిద అరుపుకూడా అందంగా ఉంటుందంటే నమ్మండి. మనకు సంగీతం ఏమిటండీ. శాస్త్రీయ సంగీతానికి దాక్షిణాత్యులు. లఘుగానానికి ఔత్తరాములూను. నామాట వినండి. దానికి తగలేసే డబ్బుతో నాలుగు సినిమాలు చూడొచ్చు' అన్నాడు.

'రండి అయితే సినిమాకే పోదాం' అన్నాను.

'అబ్బే! వెధవ తెలుగు పిక్చరేదో ఆడుతోంది. అదేమిటి చూచేది? ఏదేనా హిందీ ఫిలిము అయితే బాగుంటుందికాని'

'అదేమి టలా అంటారు. బోలెడన్ని తెలుగు పిక్చర్లు వస్తున్నాయి. బోలెడంత డబ్బూ వస్తోంది వాటికి. చాలా బాగున్నాయని అనుకుంటున్నారు అంతాను' అన్నాను.

'డబ్బుకేంలెండి. వెధవడబ్బు. డబ్బురావడంవేరు. చిత్రం బాగుండడం వేరు. ఏమంటారు. మామూలుజనానికేం తెలుస్తుంది. పైవాళ్లకుమట్టుకు? మనవాళ్లకు సరియైన అభిరుచులు లేవు. రసగ్రహణ శక్తి లేదు. ఏమీ లేదు. నాలుగు డబ్బు లెక్కడో కొట్టుకురావడం, మంచిరోజుచూచి డైరెక్టరని బోర్డు కట్టుకోడం, ఓ చిత్రంతీసి మన నెత్తిన రుద్దడం. అందులో అందమా! కళా! కథా! ఏముంటుంది. అసలు హిందీవాళ్లలాగ ఉత్తమచిత్రాలుతీస్తే మనవాళ్లకు వాటినిచూచి ఆనందించే శక్తికూడా లేదు. మనవాళ్లున్నదే, వట్టి........ పోనిద్దురూ, నాకెందుకు' అని ఊరుకున్నాడు.

నేను అంతటితో ఊరుకోక 'అదేమిటండి. మనవాళ్లు సాహిత్యరంగంలోనూ, నాటకరంగంలోనూ, అన్నిటిలోనూ చాలా ఉన్నతశ్రేణిలో ఉన్నారని విన్నాను. మన ఆధునిక కవిత్వం, కథానికలు, నాటికలు మొదలైనవి ఇతరరాష్ట్రాలవాటికంటె ఏమీ తీసిపోవనీ, తీసిపోవడమేకాదు వాటికంటె చాలా బాగుంటాయనికూడా విజ్ఞులు చాలామంది అనగా విన్నాను. అంతేకాకుండా నాటకరంగంలోకూడా ప్రదర్శనంలోనేమి, అభినయంలోనేమి మనవాళ్లే పెచెయ్యంటారు!' - అన్నాను.

'అబ్బే! డబ్బా! వట్టిడబ్బా! అదొక్కటే మనకు చేతనైనది! డాయింపు, డబాయింపూను. నాటకం అన్నప్పుడు బెంగాలీ నాటకం. కథలన్నప్పుడు హిందీ

# ఆంధ్రపత్రిక

## సచిత్ర వారపత్రిక.

## ప్రత్యేక సంక్రాంతి సంచిక.

ప్రత్యేక త్రివర్ణ ముఖచిత్రం, పోటీలో గెలుపొందిన కథానికలు, సంక్రాంతి దృశ్యాల చిత్రాలు, ఫొటోలు, ప్రత్యేక రచనలు, వనితాలోకం, సినిమా, బొమ్మరిల్లు, సీరియల్ మొదలైన వానితో సంక్రాంతి సంచిక సర్వాంగసుందరంగా ముద్రించబడుచున్నది.

'శారద' గారి అపస్వరాలు నవల సంక్రాంతి సంచికలో ప్రారంభమౌతుంది.

**68 పేజీలు: వెల 4 అణాలు.**

**మీ కాపీలను నేడే మీ మీ ఏజంట్లవద్ద రిజర్వు చేసుకోండి.**


కథలు, బెంగాలీ కథలు. నాటకాలన్నారు బెంగాలీవాళ్లదే అగ్రతాంబూలం. ఆ విషయంలో, అంతేనే కాని, మనకి సాహిత్యం నాటకం. అబ్బెబ్బే! నాదగ్గర అంటే అన్నారు కాని ఎవ్వరిదగ్గరా అనకండి నవ్వుతారు' అన్నాడు.

'అయితే మీకు హిందీ, బెంగాలీ వగైరా భాషలు బాగా వచ్చునన్నమాట' అన్నాను.

'అబ్బే రావండి. చదువుదామని ఉన్నది కాని తీరికేదీ.'

'అయితే వాళ్ళ పుస్తకాలేవీ చదవలేదన్నమాట.'

'లేదు. చెప్పాకాదూ, తీరిక లేదని.'

'మనవాళ్ళ పుస్తకాలు చదివేఉంటారు'

'చంపారు. మన పుస్తకాలా. నాకేం మతి లేదనుకున్నారా, పని లేదనుకున్నారా! తెల్లవారి లేచి మన ఉమ్మాయి జగ్గాయిలు రాసిన చెత్తా చెదారం చదువుతూ కూచుంటాననుకున్నారా! మీరు చాలా పొరపాటు పడ్డారు.'

'నిజమే సుమండీ. క్షమించాలి. మీకు నాటకాలమీద అభిమానం ఎక్కువలా ఉన్నది. నాటకాలు చాలా చూచి ఉంటారు!'

'అభిమానమున్నమాట వాస్తవమే కాని, నేనేం చూడలేదు. ఇలా వృథాగా తగలెయ్యడానికి తీరికాలేదు. డబ్బూ లేదు. నేను పదహారణాల ఆంధ్రుణ్ణి. తెలుసునా అండి.'

'నిజమే సుమండీ. పోనీ ఏవో రెండు నాటకాలూ, నాలుగు నవలలూ మీరే రాసి పారెయ్యకూడదు. ఆదర్శప్రాయంగా ఉంటాయి.'

'అదే అనుకుంటున్నాను సార్. అయినా ఒక్క క్షణం తీరిక ఉండదండి. చస్తున్నాను వీళ్లతోటి.'

'ఎందుకు తీరిక లేదు? ఇన్నాళ్లనుంచీ అడగడం మరచిపోయాను. మీరేం చేస్తున్నారు.'

'ఆс. ఏం లేదులెండి. ఏదో చేద్దామనుకుంటున్నాను. బోలెడన్ని ఉన్నాయి చెయ్యవలసినవి. దేనికీ ఊపిరి తీసుకోనివ్వరు. ప్రనిదానికీ నన్నే చంపడం. ఎన్నికని చావను. మీటింగు పెట్టించాలంటే నేను. దేవుడు కళ్యాణమంటే నేను. ఊళ్లో సంతర్పణంటే నేను. ఎన్నికలంటే నేను. పెళ్లంటే నేను. పురుడంటే నేను. చావంటే నేను. వాటితో మధ్య నేను చస్తున్నాను.'

'ఒక్క మాటలో చెప్పాలంటే ఈ భూభారమంతా మీరే మోస్తున్నారందురూ! అబ్బా! కాస్త మనిషైనా ఎంత పని చేస్తున్నారు. పోనీలెండి దేవుడికి కాస్త విశ్రాంతి కలుగచేశారు. సంతోషం' అన్నాను.

'ఏమిటండీ! మీకేం వేళాకోళంగా ఉన్నట్టుంది. పెద్దమనిషిలా కనపడ్డారు. కూడా కూడా తిరుగుతున్నారు. పోనీ దానివల్ల మీ కేమైనా ఉపకారముంటుందేమోనని ఊరుకుంటే, నాకే తాటాకులు కడుతున్నారూ. మీమాత్రం వెటకారం మాకూ తెలుసు నండోయి. మేమేం *Grand-mothers* అనుకోకండి. మేము పదహా...'

'అబ్బెబ్బె! ఎంతమాట! మీరు పదహారణా లాంధ్రులన్న సంగతి తెలుసు. అది వరకు కాకపోయినా మీ సహవాసంవల్ల తెలుసుకున్నాను. మీరు పదహారణాల ఆంధ్రులు గనుక, మీకు ఆంధ్రుల చరిత్ర కాని, ఆంధ్రుల దేశభాషలుకాని, వారి శిల్పం, సాహిత్యం, సంగీతం, సంస్కృతీ వగైరా మీకేమీ అవసరంలేదు. అవన్నీ ఏవో మాలాటి అణా బేడా ఆంధ్రులపని. మీరు ఊరికే అనాథలను అనుకరిస్తూ, ప్రతి స్పల్యానికీ వాళ్లని యాచిస్తూ, పొగుడుతూ, వెనకాలవాళ్లని తిడుతూ, ఇక్కడ చావల్ ఖరాబు చేస్తూ ఎక్కడికెళ్లినా ఆంధ్రులంటే ఇంతేకాబోలు ననిపించేటట్టు పెద్ద గొంతుకతో అరుస్తుంటే చాలు. అదే మాకు పదివేలని ఆంధ్రజాతి ఆజన్మాంతం మీకు కృతజ్ఞులై ఉంటారు? అన్నాను తీవ్రంగా.

'ఇదుగో'...అని ఏదో అనబోయాడు.

'చాల్లేవయ్యా నడువు, నీసంగతి తెలుసుకుందామనే ఇన్నాళ్లూ తిరిగాను తెలిసింది. దయిచెయ్యి' అన్నాను, బహువచనం విడిచిపెట్టి. ఏదో అనబోయి చేపలా నోరు తెరిచి మళ్లీ ఏమీ అనకుండానే గబగబా చక్కాపోయాడు.

ఇది బాబూ నా రిసర్చివల్ల తేలినవిషయం. మీ అనుభవం ఏమిటో మరి.

"రైట్ నూటికి నూరుపాళ్లూ కాదుకాదు రూపాయికి పదహారణాలూ కరెక్టు. తభావతేమీ లేదు. ఇంతటితో వందన సమర్పణ లేకుండా పోదామా...ఇక పోదామా... ఆటలు, మాటలు, పాటలు మానేసి పోదామా. ఇక పోదామా" అన్నాడు శర్మ.

★